## వైద్య విద్యార్థినికి చేయూత

వెల్దండ, అక్టోబర్ 21 : మండల కేంద్రానికి చెందిన వెల్దండ హాసిని అనే విద్యార్థిని నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా సోమవారం వెల్దండలో పలువురు నాయకులు హాసినిని శాలువాలతో సన్మానించారు. వైద్యవిద్య కోసం తమ వంతుసాయంగా రూ.10వేలు నగదు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి రామకృష్ణ, నాయకులు దుర్గాప్రసాద్, నరేశ్‌చారి, అంజయ్య, పాండుచారి, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## గెస్టు లెక్చరర్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సదానందం

కల్వకుర్తి, అక్టోబర్ 21 : తెలంగాణ రాష్ట్ర అతిథి అధ్యాపకులు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉమ్మడి పాలమూరు జిల్లా కల్వకుర్తికి చెందిన అయిల్ సదానందంగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేఎల్ కార్యాలయంలో గెస్ట్ లెక్చరర్స్ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో భాగంగా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సదానందంగౌడ్‌ను ప్రకటిస్తూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

## ఎఫ్‌ఎల్‌ఎన్‌ను అమలు చేయాలి

వెల్దండ, అక్టోబర్ 21 : ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేసి విద్యార్థుల సామార్థ్యాలను పెంచాలని వెల్దండ ఎంఈవో చంద్రుడు అన్నారు. సోమవారం వెల్దండ మండలం గుండాల, చెదురుపల్లి, ఈదమ్మబండతండా, బొల్లంపల్లి, దేశిగానీతండా, ఉబ్బలగట్టు తండా, చల్లపల్లి, బండోన్‌పల్లి, చొక్కన్నపల్లి పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఏకలవ్య గురుకుల పాఠశాలను తనిఖీ చేసి వసతులను పరిశీలించారు.

## బాధిత కుటుంబాలకు మున్సిపల్ చైర్మన్ పరామర్శ

కల్వకుర్తి/బిజినేపల్లి, అక్టోబర్ 21 : కల్వకుర్తి మున్సిపాలిటీ ఇందిరానగర్ కాలనీకి చెందిన చిన్న సాయిలు కుటుంబాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పరామర్శించారు. చిన్న సాయిలు అనారోగ్యంతో చనిపోయిన విషయాన్ని తెలుసుకున్న ఎడ్మ సత్యం బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ.5వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. బిజినేపల్లి మండలంలోని చిన్నపీరు తండాలో సోమవారం మృతి చెందిన జాగ్రం కుటుంబ సభ్యులను తండాకు చెందిన శ్రీగణేశ్ యువజన సంఘం సభ్యులు పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. కౌన్సిలర్ సైదులు గౌడ్, శ్రీను ఈశ్వరయ్య, సాయిబాబా, జనార్దన్, బాలరాజు, రాజ్‌కుమార్, నరేశ్ పాల్గొన్నారు.

## రవాణా రంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 21 : రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఫ్రీ బస్సు వల్ల ఉపాధి కోల్పోయిన కార్మికులకు జీవన భృతి చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన రవాణా రంగ కార్మికుల జనరల్‌బాడీ సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత న్యాయ సంహిత(బీఎన్‌ఎస్)106(1) రద్దు చేయాలని, ఫ్రీబస్సు వల్ల ఉపాధి కోల్పోయిన ఆటో, టాటా ఏసీ, క్యాబ్ డ్రైవర్లకు జీవన భృతి నెలకు రూ.4500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగ కార్మికుల కోసం సంక్షేమబోర్డు ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటరు వాహన చట్టాన్ని రద్దుచేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య, ఆయా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


























